



ముక్కోటి.. భక్తకోటి

- వైభవంగా వైకుంఠ ఏకాదశి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- రామతీర్థంలో ఉత్సాహంగా గిరి ప్రదక్షిణ



విజయనగరం కల్యాణ వేంకటేశ్వర స్వామి దర్శనానికి క్యూలైన్లలో వెళ్తున్న భక్తులు

● నెల్లిమర్లలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో నిర్వహించిన గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. రామనామస్మరణ చేస్తూ, దాదాపు 10 కిలోమీటర్లు గిరి ప్రదర్శన చేశారు. గిరి ప్రదర్శనకు ముందు, తరువాత భక్తులు అధిక సంఖ్యలో రాములోరిని దర్శించుకున్నారు.



రామతీర్థంలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, (ఇన్‌సెట్లో) ఉత్సవ మూర్తులు

విజయనగరం జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ముక్కోటి ఏకాదశిని ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఉత్తర ద్వారం గుండా దేవతామూర్తుల దర్శనా నికి బారులు తీరారు. గోవిందా.. గోవిం దా.. నమో నారాయణ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. బంతి, చా మంతి, గులాబీలతో పుష్పాభిషేకాలు నిర్వహించారు. విజయనగరం, నెల్లిమర్ల, గరివిడి, చీపురుపల్లి, గజపతినగరం, బొండపల్లి, మెంటాడ, దత్తిరాజేరు, బొబ్బి లి, ఎస్‌కోట, గంట్యాడ, జామి తదితర మండలాల్లోని వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. విజయనగరంలోని మన్నార్ రాజగోపాల స్వామి, శివాలయం వీధి, తోటపాలెం, రింగు రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం ఎదుట, చింతలవలస తదితర ప్రాంతాల్లో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బం దులు కలగకుండా ఆలయాల నిర్వా హకులు ఏర్పాట్లు చేశారు.



పుష్ప అలంకరణలో శేషపాన్పుపై విష్ణుమూర్తి

న్యూస్ బాక్స్

20 నుంచి కుష్ఠుపై అవగాహన కార్యక్రమాలు

విజయనగరం, కలెక్టరేట్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2 వరకూ 14 రోజుల పాటు కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో లెప్రసీ అవగాహన కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కాళ్లు లేదా చేతుల కండరాల్లో బలహీనత, పాదాలు, నరాల్లో తిమ్మిర్లు, తదితర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి జీవన్‌రాణి పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా? జాగ్రత్త

- బంగారం, నగదు ఇంట్లో ఉంచవద్దు
- పోలీసులకు సమాచారం ఇస్తే మేలు
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో నిఘా

6లో

తెరచాటు బాదుడు

- ప్రేక్షకులపై తిను'బండ'రాలు
- అధిక ధరలకు స్నాక్స్ విక్రయం
- సినిమాకు వెళ్తే జేబు గుల్ల
- కానరాని నియంత్రణ చర్యలు

● విజయనగరానికి చెందిన అప్పలనాయుడు ఓ ప్రైవేటు ఉద్యోగి. ఆయన జీతం రూ.15 వేలలోపే. నెలంతా ఖర్చులు పొదుపు చేసుకుని వెళితే కానీ.. కుటుంబ జీవ నం కష్టం. ఓ ఆదివారం తన ఇద్దరు పిల్లలు సినిమాకు తీసుకెళ్లాలని మారాం చేశారు. దీంతో భార్యా పిల్లలతో కలిసి నగరంలోని ఓ థియేటర్‌కు వెళ్లాడు. నలుగురి టిక్కె ట్లు రూ.400కాగా, థియేటర్‌లో స్నాక్స్ ఖర్చు, బైక్ పార్కిం గ్‌కు రూ.500 అయింది. చిన్న కుటుంబం రెండున్నర గంటల సినిమా చూసేందుకు రూ.900 ఖర్చు చేయాల్సి వచ్చింది.

● సాధారణంగా బయట దుకాణాల్లో సమోసా ధర రూ.10 ఉంటుంది. మరీ పెద్దదైతే రూ.15 వరకూ పలుకుతుంది. కానీ, థియేటర్లలో మాత్రం రూ.40కు విక్రయిస్తున్నారు. బయట మార్కెట్లో పాప్‌కార్న్ ధర రూ.10 ఉంటే సినిమా హాళ్లలో రూ.30కు, రూ.20 ఉండే కూల్ డ్రింక్‌ను రూ.40కు విక్రయిస్తున్నారు. స్వీట్‌కార్న్ విషయానికి వస్తే ఒక పొత్తు ధర బయట రూ.10 వరకూ ఉంటుంది. అదే పొత్తుతో రెండు కప్‌ల స్వీట్‌కార్న్‌ను రూ.80లు విక్రయిస్తున్నారు. కాంబోల పేరుతో రూ.300 నుంచి రూ.400 వరకు లాగేస్తున్నారు.



విజయనగరం జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సినిమా థియేటర్లలో ప్రేక్షకులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. టిక్కెట్ల కంటే పాప్‌కార్న్, చిప్స్, కూల్‌డ్రింక్స్ వంటి తినుబండారాలకే ఎక్కువ వెచ్చించాల్సి వస్తోంది. అలాగే, వాహనాల పార్కిం గ్‌కు కూడా అదనంగా చెల్లించాల్సిందే. సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో సినిమా చూడాలంటే నలుగురు కుటుంబ సభ్యులు రూ.1000 ఖర్చు చేయాల్సిందే. అదే మల్టీప్లెక్స్‌ల్లో అయితే ఈ ఖర్చు రెట్టింపు ఉం టుంది. దీంతో సామా న్య ప్రేక్షకులు కుటుంబం తో కలిసి థియేటర్లకు వెళ్లేం దుకు భయపడుతున్నారు. పెద్ద హీరోల సినిమాలు ఎక్కువగా దసరా, సంక్రాంతి వంటి పండుగల సమయాల్లో విడుదల అవుతుంటా యి. వీరి సినిమాలను చూసేందుకు ప్రేక్షకులు సైతం ఉత్సా హం చూపిస్తుంటారు. ఇదే అదునుగా వారిని థియేటర్ల యాజమాన్యాలు దోచుకుంటున్నాయి. స్నాక్స్‌ను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. రెండున్నర గంటల సినిమా చూసేందుకు ఎంత ఖర్చుపెడతామో, ఇంటర్వెల్‌లో కొద్దిపాటి సమయంలో స్నాక్స్ కోసం అంతే ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రేక్షకులు వాపోతున్నారు. సాధారణంగా పిల్లలు పాప్‌కార్న్, చిప్స్ వంటివి అడుగుతుంటారు. అయితే థియేటర్లలో రూ.5, రూ.10 విలువచేసే చిప్స్ ప్యాకెట్లు ఉండవు. అక్కడంతా కాంబో ప్యాక్. వాటి ధర రూ.30 పైమాటే. అలాగే, బయట దుకాణాల్లో రూ.10కు చిన్న బాటిళ్లలో కూల్‌డ్రింక్స్ లభిస్తుంటాయి. కానీ, సినిమా హాళ్లలో మాత్రం అవి దొరకవు. ఇక్కడ కూల్‌డ్రింక్ తాగాలంటే రూ.30 చెల్లించుకోవాల్సిందే. మల్టీప్లెక్స్‌ల్లో అయితే రూ.50 వరకూ వసూలు చేస్తున్నారు. అదే విధంగా రూ.10కి లభించే బ్రెడ్, కేక్‌లు రూ.25కు పెంచి అమ్ముతున్నారు. వెజ్ పఫ్, ఎగ్‌పఫ్ రూ.45కు విక్రయిస్తున్నారు. పిల్లలు మారాం చేస్తే వీటిని కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

జీఎస్టీ పేరిట అదనంగా..

చాలా మంది థియేటర్లలో జనాల రద్దీలో తినుబండారాలు కొనుగోలు చేసేందుకు (మిగతా 8వ పేజీలో..)

లక్షలు ఖర్చు చేసినా.. లక్ష్యం నెరవేరలే?

- నిరుపయోగంగా బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు
- గ్రామాలకు దూరంగా నిర్మాణం
- వినియోగించుకోలేక పోతున్న రైతులు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే కారణం



గజపతినగరం మండలం కొత్తబగ్గాంలో వినియోగంలోకి రాని గోడౌన్

గజపతినగరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు జిల్లాలో నిరుపయోగంగా ఉన్నాయి. గ్రామాలకు దగ్గరగా కాకుండా, ఎక్కడో దూరంలో కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఈ గోదాములు రైతులకు ఉపయోగపడడం లేదు. జగన్ సర్కారు అనాలోచిత నిర్ణయం వల్ల కాంట్రాక్టర్లకే మేలు జరిగిందని, రైతులకు ఒరిగిందేమీ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర పథకంలో భాగంగా గత వైసీపీ ప్రభుత్వం జిల్లాకు 48 గోదాములను మంజూరు చేసింది. వీటిలో మొదటి విడత 37, రెండో విడత 11 గిడ్డంగుల నిర్మాణాలకు నిధులు విడుదల చేసింది. వీటిలో 500 టన్నుల సామర్థ్యం ఉన్నవి 35, వెయ్యి టన్నుల సామర్థ్యం ఉన్నవి రెండు ఉన్నాయి 500 సామర్థ్యం టన్నుల గోదాము ఒక్కొక్కటినీ రూ.40లక్షలతో, వెయ్యి టన్నుల గోదాములను రూ.75లక్షలతో నిర్మించారు. అయితే, ఇవి గ్రామానికి దూరంగా ఉండడంతో రైతులు వినియోగించుకోలేక పోతున్నారు. పంట ఉత్పత్తులను గిడ్డంగులకు చేర్చాలంటే వ్యయ భారం అధిక మవుతుందని వాపోతున్నారు. కొన్ని గోదాముల నిర్మాణాల్లో నాణ్యత లోపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదటి విడతలో నిర్మాణం చేపట్టిన గోదాముల్లో 23అందుబాటులోకి రాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. కాగా, వీటి నిర్మాణానికి నాబార్డు.. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రుణం మంజూరు చేసింది. గిడ్డంగులు పూర్తయిన తరువాత సొసైటీల నుంచి ప్రతినెల వాయిదాల కింద రూ.60వేలు డీసీసీబీ వసూలు చేసి నాబార్డుకు చెల్లించాలి. అయితే, గిడ్డంగులు వినియోగంలోకి రాక. వాటిపై ఆదాయం లేక సొసైటీలు రుణ వాయిదాలు చెల్లించలేకపోతున్నాయి.

కలెక్టర్ ఆదేశించినా..

బహుళ ప్రయోజన సౌకర్య గోదాముల వినియోగంపై కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇటీవల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిర్మాణాలు పూర్తయిన వాటిని తక్షణమే వినియోగంలోకి తీసుకు రావాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులు ఉన్నా వాటికి ఆమోదం తెలిపారు. అయినా ఇప్పటివరకు గోదాముల వినియోగానికి సంబంధించి ఎటువంటి పురోగతికి లేదు.

వినియోగంలోకి తీసుకువస్తాం

జిల్లాలో 48 ఎంపీఎఫ్‌సీ గోదాములు మంజూరు కాగా, మొదటి విడతలో 37 గోదాములు నిర్మించాం. రెండో విడతలో మంజూరైన 11 గిడ్డంగుల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రస్తుతం 23 గోడౌన్‌లు అందుబాటులో ఉన్నాయి. రైతులు తమ పంటలను నిల్వ చేసుకోవడానికి ఈ గోదాములను వినియోగించుకోవాలి. మిగతావి కూడా అందుబాటులోకి తీసుకువస్తాం.

-పి.రమేష్, డీసీవో

ఆర్గానిక్ ఉత్పత్తులతో ఆరోగ్యం: కలెక్టర్

విజయనగరం, కలెక్టరేట్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన ఆర్గానిక్ ఉత్పత్తులను శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద ప్రదర్శించారు. వీటిని జేసీ సేతు మాధవన్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఎన్ని ఎకరాల్లో సాగు చేస్తున్నారు? ఎంత పెట్టుబడి పెడుతున్నారు? ఎంత లాభం వస్తుంది? సమస్యలేమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే జిల్లాలో 12 వేల ఎకరాల్లో ఆర్గానిక్ పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సాగు విస్తీర్ణం పెంచడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ తారాక రామారావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను ఆడిట్ చేయాలి

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తునూ డిప్యూటీ కలెక్టర్లు ఆడిట్ చేయాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి లైన్ డిప్యూటీ కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 'రెవెన్యూ సదస్సుల్లో 6,846 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 2,776 దరఖాస్తులను ఇప్పటికే తహసీల్దార్లు పరిష్కరించారు. వాటిని కూడా డిప్యూటీ కలెక్టర్లు ఆడిట్ చేయాలి. గ్రామాల్లో అర్జీదారులను పిలిపించి వారు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం లభించాలి. ఈ దరఖాస్తులను పరిష్కరిస్తే దాదాపు జిల్లాలో రెవెన్యూ సమస్యలు ఉండవు. కోర్టుల నుంచి ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఉన్నవి మినహా, వివాదాలు ఉన్న భూముల సమస్యలను కూడా పరిష్కరించవచ్చు.' అని తెలిపారు.



ఆర్గానిక్ ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేడ్కర్

ఉత్తర ద్వార దర్శనం.. భక్తుల తన్మయం


రామభద్రపురం: ఆరికతోటలో పూజలందుకుంటున్న వేంకటేశ్వర స్వామి

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం జిల్లాలోని వైష్ణవాలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనానికి వేకువజాము నుంచే ఆలయాల వద్ద భక్తులు బారులుతీరారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాలలోని వివిధ ఆలయాలతో పాటు బొబ్బిలి, సాలూరు, నెల్లిమర్ల, పాలకొండ తదితర ప్రాంతాల్లోని వేంకటేశ్వర, జగన్నాథ, శ్రీకృష్ణాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను వివిధ రకాల పూవులు, విద్యుత్తు దీపాలతో సుందరంగా అలంకరించారు.

-ఆంధ్రజ్యోతి బృందం

- వైష్ణవాలయాల్లో ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు
- వేకువజాము నుంచే భక్తుల బారులు
- సుందరంగా ముస్తాబైన ఆలయాలు


విజయనగరం: కల్యాణ వేంకటేశ్వర ఆలయ కోనేరు వద్ద భక్తుల రద్దీ


రామతీర్థంలో విద్యార్థిని నృత్య ప్రదర్శన


పార్వతీపురం టౌన్: శ్రీనివాసుని దర్శించుకుంటున్న రెండో అదనపు న్యాయాధికారి దామోదరరావు తదితరులు


బొబ్బిలి: వేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులకు పుష్పాలంకరణ


బొబిలి రూరల్: గొర్లెసీతారాంపురం కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో..


సాలూరు రూరల్: పెదకోమటిపేట రామాలయంలో పుష్పాలంకరణ


వేపాడ: శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామికి పూజలు


సీతంపేట రూరల్: టీటీడీ దేవాలయంలో పూజలు చేస్తున్న అర్చకులు


గజపతినగరం: వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ


పాలకొండ: సీతారామస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రామతీర్థంలో ముక్కోటి వేడుకలు

- బోడికొండ మెట్లకు ఘనంగా పూజలు ● గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం

నెల్లిమర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 5 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనానికి దేవస్థానం అర్చకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. వందలాది మంది ఉత్తర ద్వారం ద్వారా సీతారాములను దర్శించుకున్నారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. జైశ్రీరామ్ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. దేవస్థానం ఈవో వై.శ్రీనివాస రావు పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు.

బోడికొండ మెట్లకు పూజలు..

ఏటా ముక్కోటి ఏకాదశి నాడు దేవస్థానం అధికారులు, అర్చకులు బోడికొండ మెట్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మెట్లోత్సవం పేరిట వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

గిరి ప్రదక్షిణలో భక్తజనం

ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి ఆధ్వర్యంలో శుక్రవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరయ్యారు. బోడి కొండ మెట్ల వద్ద ఈ గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రామతీర్థం ఎస్టీ కాలనీ, మెయిన్‌రోడ్డు, సీతారామునిపేట జంక్షన్, గొర్లెపేట కాలనీ, దుర్గ కొండ ప్రాంతాలమీదుగా బోడి కొండ చుట్టూ సుమారు 9 కిలోమీటర్ల దూరం భక్తులు ప్రదక్షిణ చేశారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఉంచి కొండ చుట్టూ తిప్పారు. మహిళా కళాకారులు కోలాటం ప్రదర్శించారు. భక్తులు భజన పాటలు పాడుకుంటూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు ఉచితంగా మజ్జిగ, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేశారు.


ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు




మెట్ల వద్ద పూజలు చేస్తున్న శ్రీనివాసానంద సరస్వతి తదితరులు



గిరి ప్రదక్షిణలో భక్తజన సందోహం



ఊరెళ్తున్నారా? జాగ్రత్త!

- బంగారం, నగదు ఇంట్లో ఉంచవద్దు
- పోలీసులకు సమాచారం ఇస్తే మేలు ● ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌తో నిఘా

విజయనగరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సెలవులొచ్చాయి. ప్రజలు పట్టణాల నుంచి సంక్రాంతి వేడుకల కోసం పల్లెబాట పడుతున్నారు. మరికొందరు బంధుమిత్రులతో విహార, తీర్థయాత్రలకు వెళుతున్నారు. రైళ్లు, బస్సులు కిక్కిరిసి ఉంటున్నాయి. దీంతో ఎవరికి వారే ఆటోలు, వ్యానులు, కార్లు వంటి ప్రైవేటు వాహనాలలో వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. ఇంకొందరైతే ద్విచక్ర వాహనాలపైనా ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో కొన్నిచోట్ల ప్రమాద సంఘటనలూ చోటుచేసుకుంటున్నాయి. అంతేకాకుండా ఇళ్లకు తాళాలు వేసి ఊరు వెళ్లేటపుడు చోరీల కోసం దొంగలు మాటు వేసి ఉంటున్నారు. తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల సూచనలు పాటించి... జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది.



● వీటిని మరువద్దు..

ఇళ్లలో దొంగతనాలు జరగకుండా ఉండాలంటే పోలీసులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

● సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటి చుట్టూ నిఘా ఉంచుకోవాలి. ● ఊరు వెళ్తున్నట్టు గస్తీ పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ● ఇరుగు పొరుగు వారికి తమ ఇంటిపై ఒక కన్నేసి ఉంచమని చెప్పాలి. ● ఇంటికి తాళం కనిపించకుండా కర్టెన్ అడ్డుగా వేయాలి.

● ప్రయాణాల్లో ఇలా..

● కిక్కిరిసిన బస్సులు, రైళ్లలో గేటు వద్ద కూర్చోవడం, నిల్చోవడం చేయకూడదు. మహిళలు మెడలో విలువైన ఆభరణాలు వేసుకొని కిటికీల వద్ద కూర్చోకూడదు.

● గంజాయి వంటి మత్తు పదార్థాలు తరలించే ముఠా ప్రయాణించే అవకాశాలు ఉంటుంది. అందువల్ల ఇతరుల లగేజీ చూసే బాధ్యత తీసుకోకూడదు.

● ద్విచక్ర వాహనాలు కార్లు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణించొద్దు.

● సామగ్రి తరలించే వ్యాన్లు, ట్రాక్టర్లు, తొట్టి, ఆటోల వంటి వాటిలో ప్రయాణం ప్రమాదకరం.

● చోరీలకు అడ్డుకట్ట ఇలా...

తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చోరీలకు పాల్పడుతుంటారు. వీటిని అరికట్టేందుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాష్ట్ర పోలీసు శాఖ 2017 సెప్టెంబరులో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను ప్రారంభించింది. సాంకేతికతతో నేరాలు అదుపు చేసేందుకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుంది. కానీ ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల...దీనిని ప్రారంభించి ఏడేళ్లు దాటినా వినియోగించుకుంటున్న వారి సంఖ్య తక్కువగానే ఉంటోంది.

● ఎల్‌హెచ్‌ఎంఎస్‌తో ఇలా..

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఫోన్ నెంబరు, చిరునామాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. తర్వాత వచ్చే ఐడీని భద్రపరుచుకోవాలి. ఊరు వెళ్లాల్సిన సందర్భంలో యాప్‌లోకి వెళ్లి... యూజర్ ఐడీని నమోదు చేయాలి. ఊరికి వెళ్లే సమయం... తిరిగి వచ్చే సమయాన్ని టైప్ చేసి... రిక్వెస్ట్ పోలీస్ వాచ్ అనే ఆప్షన్ ఎంచుకోవాలి. సమాచారం అందుకున్న కంట్రోల్ రూమ్ పోలీసులు... స్థానిక పోలీసుల సహకారంతో రిక్వెస్ట్ వచ్చిన అడ్రస్‌లో వైఫై రూటర్, సెన్సార్‌తో పనిచేసే మోషన్ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీస్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేస్తారు. తాళం వేసి ఉన్న ఇంట్లోకి అపరిచితులు చొర బడేందుకు ప్రయత్నిస్తే సెన్సార్ ద్వారా కంట్రోల్ రూం, లోకల్ పోలీసులను అప్రమత్తం చేస్తుంది. నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడికి చేరుకుని దొంగలను పట్టుకునే అవకాశం ఉంటుంది. దీనిపై ఇటీవల కాలంలో పోలీసులు ఎక్కడికక్కడ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఎలా వినియోగించుకోవాలో తెలియజేస్తున్నారు.

ఊరెళితే చెప్పండి..

సంక్రాంతి పండుగకు సుదూర ప్రాంతాలకు వెళ్లదలచిన వారు పోలీసులకు చెప్పి వెళ్లండి. ఇంటికి భద్రత కల్పిస్తాం. అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం. ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా ఎప్పటికప్పుడు ఇంటిని పరిశీలిస్తాం. సంక్రాంతికి ఊరు వెళ్లే వారు ఇళ్లలో ఆభరణాలు, నగదు, విలువైన వస్తువులు విడిచి పెట్టకూడదు. వృద్ధులను ఒంటరిగా వదిలి వెళ్లడం శ్రేయస్కరం కాదు. ఇరుగు పొరుగు వారికి చెప్పి.. ఇంటి ముందు తుడవటం, ముగ్గులు వెయ్యడం వల్ల ఇంట్లో మనుషులు ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో దొంగలు ఇళ్లలో చొరబడే అవకాశం ఉండదు. ఇంటి బయట లైట్లు ఆన్‌చేసి ఉండేలా చూడండి. ఎవరైనా అపరచిత వ్యక్తులు వీధుల్లో తిరుగుతుంటే.. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

-ఎస్పీ వకుల్ జిందాల్

తోటపల్లిలో భక్తుల పూజలు

గరుగుబిల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి వారి దేవస్థానాల్లో శుక్రవారం ముక్కోటి (వైకుంఠ) ఏకాదశిని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉభయ దేవస్థానాల్లో ముందుగా ఆలయ ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు ప్రధాన పూజలు చేశారు. అనంతరం ఉభయ దేవస్థానాల్లో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకుని స్వామివారికి, అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా హనుమంత వాహనంపె తిరువీధి మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎస్.రాజారావు, పర్యవేక్షకులు శ్రీనివాసరాజులు, ఈవో వీవీ సూర్యనారాయణ, ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, ఆలయ సిబ్బంది జి.శ్రీధర్‌నాయుడు, పి.పోలిరాజు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

వెయిట్ లిఫ్టింగ్‌లో చంద్రికకు రెండు బంగారు పతకాలు

నెల్లిమర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఒడిశాలో జరుగుతున్న ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నెల్లిమర్లకు చెందిన బయిరెడ్డి చంద్రిక రెండు బంగారు పతకాలు సాధించింది. జూనియర్, సీనియర్ విభాగాల్లో

రెండు విభాగాల్లోనూ..

బంగారు పతకాలు సాధించడం విశేషం. చంద్రికకు జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించడంపై తల్లిదండ్రులు బయిరెడ్డి రమణ, సరోజిని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్‌తో పాటు ఆ పార్టీ నాయకులు బయిరెడ్డి నాగేశ్వరరావు, లెంక అప్పలనాయుడు, బయిరెడ్డి కల్యాణ్‌చక్రవర్తి ఆమెను అభినందించారు. చంద్రిక అక్క రాజేశ్వరి కూడా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జాతీయ స్థాయి బహుమతులు సాధించింది. రాజేశ్వరి ప్రస్తుతం రైల్వే ఉద్యోగం సాధించి టిక్కెట్ కలెక్టర్‌గా పనిచేస్తోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అక్క సూచనలు, సలహాలతో వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్నట్లు చంద్రిక విలేకరులకు తెలిపింది.


చంద్రిక

భక్తిశ్రద్ధలతో 'ముక్కోటి' పూజలు



భర్తపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లలితకుమారి



వేణుగోపాలస్వామి ఆలయంలో కుటుంబ సమేతంగా జడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

శృంగవరపుకోట రూరల్ /జామి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భర్తపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన ముక్కోటి ఏకాదశి వేడుకల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహంచారు. జామి మండలం అన్నంరాజుపేటలోని పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ●సంతకవిటి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా గుళ్లసీతారాంపురంలోని పురాతన కోదండరామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి పూజలో పాల్గొన్నారు. అలాగే మద్దూరు శంకరపేటలో సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ●గంట్యాడ: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం మండలంలోని ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గంట్యాడ, గొడియాడ, రామవరం గ్రామాల్లో వెంకటేశ్వరస్వామి అలయా లతో పాటు వైకే పర్తిలో



డెంకాడలోని వేంకటేశ్వరాలయంలో..



గుళ్లసీతారాంపురంలోని కోదండ రామాలయంలో...

ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంది. ఉదయం నుంచే ఆలయాలు వద్ద భక్తులు క్యూకట్టారు.

●గరివిడి: గరివిడి మండలంలో ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు జరిగాయి. మండలంలోని ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. గరివిడి పట్టణంలోని వెంకటేశ్వరస్వామి, రామాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



గరివిడిలో ఆలయం ఎదుట భక్తులు

12న వాజీ చానల్ రంగోళి పోటీలు

విజయనగరం దాసన్నపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో ఈ నెల 12న ఉదయంవాజీ చానల్ ఆధ్వర్యంలో రంగోళి పోటీలు నిర్వహిస్తున్నట్లు వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పోటీల్లో రూ.3 లక్షల విలువ చేసే బహుమతులను అందజేయనున్నామని పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నామని తెలిపారు.

నేడు కొత్తపేటలో దీపారాధన

విజయనగరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కొత్తపేట, యాదవవీధి కోదండ రామాలయం వద్ద శనివారం ఉదయం దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మేలుకొలుపులు నిర్వహించిన రామాలయ భక్తబృందం మహిళలు.. గోదాదేవి విగ్రహంతో కోదండ రామాలయం నుంచి బ్రహ్మం మఠం, బంగారమ్మ చదురు మీదుగా కొత్తపేట నీళ్లట్యాంకు, అక్కడి నుంచి రాధాకృష్ణ జంక్షన్, అంబటి సత్రం మీదుగా మూడు లాంతర్లు వద్ద పైడిమాంబ ఆలయానికి ఊరేగింపుగా చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత శివాలయం వీధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తపేట మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో పూజలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి కోదండ రామాలయం వద్దకు ఊరేగింపుగా చేరుకుని భక్తులకు ప్రసాద వితరణ చేయనున్నారు.

బకాయిలు వెంటనే చెల్లించండి

విజయనగరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు కోరారు. శుక్రవారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు భత్యం, మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఉత్తరాంధ్ర శాసనమండలి ఎన్నికల్లో గాదె శ్రీనివాసులనాయుడు అభ్యర్థిత్వాన్ని బలపరచాలని కోరారు. జీవో నెంబరు 117 రద్దు చేయడాన్ని స్వాగతిస్తామన్నారు. అలాగే నూతన ప్రతిపాదనల్లో భాగంగా ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల, తెలుగు మాధ్యమాలు కొనసాగించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ ప్రతినిధులు డి.ఈశ్వరరావు, పైడిరాజు, ఆర్.కృష్ణ, శ్రీదేవి, శ్రీనివాసరావు, పైడితల్లి, దామోదరనాయుడు పాల్గొన్నారు.

ఓర్వలేకే విమర్శలు

లక్కరపుకోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం తలారి గ్రామంలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన గోకులం షెడ్లను ఆమె ప్రారంభించారు. రైతులకు మేలు చేసే విధంగా చంద్రబాబు ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఒకవైపు పెట్టుబడులు, మరోవైపు పశువుల షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్స్, బీటీ రోడ్లు, గ్రావెల్ మెటల్ రోడ్లు ఇలా అని రకాల పనులు గ్రామాల్లో జరుగుతుంటే వైసీపీ నేతలు ఓర్వలేక విమర్శిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రెడ్ల ఈశ్వరరావు, ఏపీవో విజయలక్ష్మి, నాయకులుచ కార్యకర్తలు ఉన్నారు.

రోడ్డుకు స్థల పరిశీలన

శృంగవరపుకోట రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి పంచాయతీ గిరిజనులు రోడ్డు సదుపాయం కల్పించాలని పలుమార్లు ఫిర్యాదు చేయడంపై కలెక్టర్ అంబేద్కర్ స్పందించారు. శుక్రవారం గ్రామాన్ని సందర్శించి రోడ్డు ఏర్పాటునకు స్థల పరిశీలన చేశారు. ఆయన వెంట తహశీల్దార్ అరుణకుమారి, డీటీ భరత్, వీఆర్‌వో నాయుడు తదితరులున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

విజయనగరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కణపాకలోని నవజీవన్ వృద్ధాశ్రమంలో తమన్నా ఫౌండేషన్ అధ్యక్షుడు బొడ్డేపల్లి రామకృష్ణారావు తల్లిదండ్రులు జ్ఞాపకార్థం వృద్ధులకు శుక్రవారం దుప్పట్లు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు పాల్గొని వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో సాగి నారాయణరాజు, హాస్టల్ మేనేజరు బి.శ్రీనివాసరావు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీపై స్పందించిన రెవెన్యూ

● కలెక్టర్ సమక్షంలో యజమానికి భూమి అప్పగింత

భోగాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌కు అందిన అర్జీపై రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం కలెక్టర్ అంబేడ్కర్ సమక్షంలో రెవెన్యూ యంత్రాంగం మండలంలోని లక్ష్మీపురంలో భూమిని పరిశీలించి సంబంధిత అర్జీదారుడికి అప్పగించారు. భూముల రీసర్వే సందర్భంగా తనకు భూహక్కు పత్రాల్లో పేర్కొన్న భూమి కంటే తక్కువ విస్తీర్ణాన్ని చూపించారని లక్ష్మీపురానికి చెందిన భార్యాభర్తలు అల్లాడ జయశ్రీ, కోటేశ్వరరావు రాష్ట్రమంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 68లో 41 సెంట్లు విస్తీర్ణం గల భూమిపై హక్కు ఉండగా 35 సెంట్లు మాత్రమే రీసర్వేలో అధికారులు చూపించారని వివరించారు. మంత్రి కార్యాలయం నుంచి వచ్చిన సమాచారం మేరకు కలెక్టర్, ఆర్డీవో దాట్ల కీర్తి, తహశీల్దార్ ఎం.సురేష్ లక్ష్మీపురంలో సంబంధిత భూమిని, వెబ్‌ల్యాండ్, 1-బి రికార్డులు పరిశీలించి సర్వే నిర్వహించారు. ఫిర్యాదులో పేర్కొన్న మాదిరిగా సర్వే నెంబరు 68/2లో 41 సెంట్లు భూమికి హద్దులు చూపించి అర్జీదారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఇమ్రాన్, సర్వేయర్ మధుకేశవరావు పాల్గొన్నారు.



భూ రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

సమ్మె ఒప్పందం జీవోలు ఇవ్వాలి

విజయనగరం దాసన్నపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సమ్మె ఒప్పంద జీవోలు ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. ఒప్పంద జీవోలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల వరకూ ఉద్యోగ పరిమితిని పెంచాలన్నారు. మరణించిన వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి కానుక రూ.1000 తక్షణమే చెల్లించాలన్నారు. జీపీఎస్ అకౌంట్‌లు తెరవాలని, జీవో నెంబరు 36 ప్రకారం ఇంజినీరింగ్, ఇతర సిబ్బందికి బేసిక్ వేతనాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు కృష్ణ, రమ, ఈశ్వరమ్మ, నాగలక్ష్మి, అప్పలరాజు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టండి

లక్కరపుకోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందని డిప్యూటీ తహశీల్దార్ రమేష్ తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏసీడీపీవో లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో కూర్మారావు, డాక్టర్ అనీల్‌కుమార్, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

డోలీలో తరలిస్తుండగా మహిళ ప్రసవం

శృంగవరపుకోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని గిరిశిఖర గ్రామం రేగపుణ్యగిరికి చెందిన గర్భిణి సిదరి శాంతిని డోలీలో తరలిస్తున్న క్రమంలో ప్రసవమైంది. గురువారం అర్ధరాత్రి పురిటి నొప్పులతో అధికం కావడంతో భర్త శివ, కుటుంబ సభ్యులు ఎస్.కోటలోని ఆస్పత్రికి తరలించాలని భావించారు. గ్రామంలో యువత సాయంతో సెల్ టార్చిలైట్‌ల వెలుగులో డోలీలో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ప్రసవమైంది. మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం ఎస్.కోట ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను చేర్చారు.



డోలీలో శాంతిని తీసుకువెళ్తున్న యువకులు

నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరుకులు

విజయనగరం రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పూల్‌బాగ్ డబుల్ కాలనీలో శిష్టకరణాల కుటుంబ సభ్యురాలు రఘుపాత్రుని లలిత ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో రఘుపాత్రుని రవికుమార్‌ను శిష్టకరణ సంఘం ప్రతినిధులు ఎంపీజీ ఈశ్వరరావు, బలివాడ వెంకటరమణారావు, బుదరాయవలస మధుసూదనరావు శుక్రవారం పరామర్శించారు. నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నిరుపేద శిష్టకరణ కుటుంబ సభ్యులను సంఘం తరఫున ఆదుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు శిష్టకరణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న శిష్టకరణ సంఘం ప్రతినిధులు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి



నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు

విజయనగరం దాసన్నపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు పేదలకు ఇళ్ల స్థలాలను ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న మాట నిలబెట్టుకోవాలన్నారు. గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, నాయకులు రాములు, వాసు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

విజయనగరం క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా పోలీస్ వేల్ఫేర్ డే కార్యక్రమాన్ని ఎస్పీ వకుల్ జిందాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

క్షణికావేశంలో దాడి.. వ్యక్తి హత్య

వీరఘట్టం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డబ్బుల విషయంలో జరిగిన గొడవ.. ఓ వ్యక్తి మరణానికి దారి తీసింది. ఈ ఘటన వీరఘట్టం మండలం సంత నర్సిపురం గ్రామంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సీఐ చంద్రమౌళి శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సంతనర్సిపురం గ్రామానికి చెందిన చింతా రామకృష్ణ (58) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన బందులుప్పి కిరణ్ అనే వ్యక్తితో డబ్బుల విషయంలో గొడవ జరిగింది.క్షణికావేశంతో కిరణ్.. రామకృష్ణను తీవ్రంగా కొట్టి తోసేశాడు. దీంతో రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబీకులు అక్కడకు చేరుకుని, రామకృష్ణను ఇంటికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108కు ఫోన్ చేశారు. అయితే వాహనం వచ్చేలోగా రామకృష్ణ మృతిచెందాడు. సమాచారం అందుకున్న సీఐ చంద్రమౌళి, ఎస్ఐ కళానిధి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి భార్య ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలకు క్లూస్‌టీంతో సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

సబ్బవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి, మూడు నెలల నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బాలికను అపహరించేందుకు స్వయంగా ఆమె పెద్దమ్మ కొడుకే నిందితుడికి సహకరించడం గమనార్హం. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గంగవరం (జీవీఎంసీ పరిధి) గ్రామానికి చెందిన తమ కుమార్తె (14) కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు గత ఏడాది అక్టోబరు 21వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పతివాడ మహేశ్ అనే వ్యక్తి (విజయనగరం పట్టణంలోని సాలిపేటకు చెందిన ఇతను కొంతకాలం నుంచి గంగవరంలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు) బాలికను బైక్‌పై తీసుకుపోయినట్టు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా గుర్తించారు. అనంతరం అదృశ్యం కేసును కిడ్నాప్ కేసుగా మార్చారు. నిందితుడి బంధువులు, స్నేహితుల ఫోన్లపై నిఘా పెట్టారు. మరోవైపు మహేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మకాం మారుస్తూ, వేరే వ్యక్తుల ఫోన్ల నుంచి బంధువులకు వాట్సాప్ కాల్స్ చేస్తూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మహేశ్ ఇటీవల తన పేరుతో సిమ్ తీసుకుని మొబైల్ ఫోన్ వాడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. సాంకేతికత సాయంతో పట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మహేశ్ శుక్రవారం బాలికను గ్రామానికి సమీపంలో విడిచిపెట్టి పారిపోతుండగా అనకపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు. బాలికను విచారించగా.. మహేశ్ తనను పెళ్లి చేసుకున్నాడని, శారీరకంగా ఒక్కటయ్యామని చెప్పింది. దీంతో నిందితుడిపై పోక్సో చట్టంతోపాటు అత్యాచారం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. బాలికను తీసుకెళ్లడానికి సహకరించిన ఆమె పెద్దమ్మ కుమారుడు పరారీలో ఉన్నాడు. మహేశ్ వద్ద నుంచి బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బాలిక తనతోపాటు ఇంటిలో నుంచి 30 తులాల బంగారం తీసుకెళ్లలేదని తమ విచారణలో తేలిందని, ఆ బంగారాన్ని బాలిక పెద్దమ్మ కుమారుడు చోరీ చేసినట్టు నిర్ధారణ అయ్యిందని డీఎస్పీ చెప్పారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపినట్టు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ పిన్నింటి రమణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు

కిడ్నాప్‌కు సహకరించిన బాలిక పెద్దమ్మ కుమారుడు

బాలికను కిడ్నాప్ చేసే విషయంలో మహేశ్ ఆమె పెద్దమ్మ కుమారుడు సహకరించినట్టు పోలీసులు వెల్లడించారు. మహేశ్‌ను తాను ప్రేమిస్తున్నానని, ఈ విషయం ఇంట్లో తెలియడంతో వేరే వ్యక్తితో పెళ్లి చేయాలని చూస్తున్నారని, తనకు సాయం చేయాలని అతడిని కోరింది. అయితే ఇంటి తాళం ఒకసారి తనకు ఇస్తే సాయం చేస్తానని బాలిక సోదరుడు అన్నాడు. దీంతో బాలిక తాళం ఇవ్వగా.. రూ.70 వేల నగదు, దుస్తులు సమకూర్చి మహేశ్‌తో వెళ్లిపోవడానికి సహకరించాడు. ఆ బాలిక ఇంటిలో సుమారు 30 తులాల బంగారు నగలను అతడే తస్కరించాడు. బాలికను మహేశ్ తీసుకెళ్లిపోయిన తరువాత నిత్యం అతనితో కాంటాక్టులో ఉంటూ పోలీసుల దర్యాప్తు తెలియపరుస్తూ వుండేవాడు. దీంతో పోలీసులకు దొరక్కుండా మహేశ్ తప్పించుకునేవాడు.

గంజాయి తాగుతున్న యువకుల అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) నగరంలోని గూడ్స్‌షెడ్ జంక్షన్ సమీపంలో గంజాయి తాగుతున్న ఆరుగురు యువకులను అదుపులోకి తీసుకున్నామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా కె.ఎల్.పురం, బాబామెట్ట, దాసన్నపేటలకు చెందిన యువకులతో పాటు, ఇంజినీరింగ్ విద్యార్థులు పట్టుబడ్డారన్నారు. వారినుంచి గంజాయి తాగే పరికరాలు, కొద్దిమొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆక్రమిత భూమిలో బోర్డు ఏర్పాటు

వేపాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీలుపర్తి పంచాయితీ శివారు దుంగాడ రెవెన్యూ లోని సర్వే నెంబరు 65లో సుమారు 20 సెంట్లు మెట్ట పోరంబోకు భూమిని రియల్ ఎస్టేట్‌దారుడు చదును చేశారని పత్రికల్లో వచ్చిన కథనాలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. శుక్రవారం భూమి పరిశీలించారు. సుమారు 15 సెంట్ల ప్రభుత్వ మెట్ట పోరంబోకు భూమిని ఆక్రమించుకున్నట్టు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ అరవింద్ పాల్గొన్నారు.

మద్యం విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలం పెంట శ్రీరామపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న డి.శ్రీనివాసరావును అరెస్టు చేసి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ రామారావు తెలిపారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, ఈసీలు జనార్దన్, నాయుడు, ధనలక్ష్మి పాల్గొన్నారన్నారు.

కొండవెలగాడ పీహెచ్‌సీలో తనిఖీ

నెల్లిమర్ల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.జీవనరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. మందులు నిల్వ గదిని పరిశీలించి యు-విన్ పోర్టల్, ఇహెచ్‌ఆర్, టెంపరేచర్ రిజిస్టర్, ఇ-ఔషధి యాప్‌లపై దృష్టి పెట్టాలని ఫార్మసిస్టును ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యులు ధనుంజయ్, పి.వి.శిరీష పాల్గొన్నారు.

తూర్పుకాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మక్క

రాజాం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మక్క సాయిబాబునాయుడు నియమితులయ్యారు. సంబంధత నియామక పత్రాన్ని తూర్పుకాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అందజేశారు. శుక్రవారం నిర్వహించిన జిల్లా కోర్ కమిటీ సమావేశంలో సాయిబాబనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తూర్పుకాపు జాతి అభ్యుదయం కోసం పనిచేస్తానన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గుమ్మడి శాంతారావు, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

జల జీవన్ పనుల పరిశీలన

వేపాడ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగుడిపాలలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులను శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించారు. లక్కవరపుకోట సబ్ డివిజనల్ తాగునీటి పథకం డీఈ కేఆర్‌పీ పైడిరాజు ఆధ్వర్యంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ రమణ తదితరులు గ్రామం మొత్తం కలియదిరిగి ఇంటింటా కొళాయిల తీరును పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ భోజంకి రామునాయుడు, కాంట్రాక్టర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు కాదు.. మురుగునీరే!



అంబటి సత్రం రోడ్డుపై నిలిచిన మురుగునీరు

● చెరువును తలపించిన అంబటి సత్రం రోడ్డు

రోడ్డువిజయనగరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలోని అంబటి సత్రం రోడ్డును శుక్రవారం మురుగునీరు ముంచెత్తింది. స్థానికులు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మురుగునీటి కాలువల్లో పూడికలు తీయకపోవడమే ఇందుకు కారణం. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. కాలువల్లో వ్యర్థాలు తొలగించి మురుగునీరు మళ్లింపునకు చర్యలు చేపట్టారు.



కాలువల్లో పూడిక తీస్తున్న దృశ్యం

రోడ్డు బాగుచేసేదెప్పుడు?

● అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వెళ్లే మార్గం
● మరమ్మతులకు గురవుతున్న బస్సులు
● ప్రయాణికులకు తప్పని అవస్థలు
● ఇదీ.. రాజాంలో దుస్థితి

రాజాం రూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): రాజాంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి వెళ్లే మార్గం గోతులమయంగా మారింది. లెవెలింగ్ పనులు చేపట్టకపోవడంతో ఆర్టీసీ బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. కొన్నిసార్లు సర్వీసులను సైతం రద్దు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కాంప్లెక్స్ ప్రారంభోత్సవం చేసి పది నెలలు గడచినా చిన్నపాటి మరమ్మతులపై శాఖాధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. వివరాలిలా ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం చేపట్టిన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఎన్నికల కోడ్ వస్తుందన్న ఆలోచనతో ఎంతో హడావుడి, ఆర్భాటంగా గతేడాది ఫిబ్రవరిలో ప్రారంభోత్సవం చేశారు. అయితే కాంప్లెక్స్ ఆవరణపై దృష్టి సారించలేదు. ఆవరణ మొత్తం గోతులమయంగా మారింది. కాంప్లెక్స్‌లోకి వెళ్లే ఎంట్రన్స్ వద్ద నిర్మించిన కాల్వపై వేసిన సిమెంట్ పలకలు ఎత్తుగా ఉండటం, కాంప్లెక్స్ ఆవరణ దిగువగా ఉండటంతో బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. అలాగే కాంప్లెక్స్ ఆవరణ సైతం గోతులమయంగా మారింది. పది నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా దాన్ని సరిచేయాలనే కనీస ఆలోచన ఆర్టీసీ ఉన్నతాధికారులు చేపట్టని తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లతో కాంప్లెక్స్ ఆవరణ మరింత అధ్వానంగా మారింది. బస్సులు రాకపోకలు సాగించే విధంగా ఎంట్రన్స్‌తో పాటు ఆవరణ చదును చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



వర్షం కురిస్తే ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట పరిస్థితి ఇదీ.. (ఫైల్)



బస్సు ముందుభాగం విరిగిపోయిన దృశ్యం

సంప్రదాయం ఉట్టిపడేలా..

● అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో సంక్రాంతి సంబరాలు ● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లాలో పండగ సందడి మొదలైంది. శుక్రవారం నుంచి పాఠశాలలకు సెలవులు ప్రారంభమవడంతో పలుచోట్ల ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలు జరిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలను రంగు రంగుల ముగ్గులతో తీర్చిదిద్దారు. భోగి మంటలు వేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


సంతకవిటి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


విజయనగరం: ఐదో సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో..


రాజాం: గాయత్రీ కాలనీలో గోపూజ నిర్వహిస్తున్న మహిళలు


సాలూరు రూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగి మంట చుట్టూ విద్యార్థినుల సందడి


బొబ్బిలి రూరల్: పారాది అంగన్‌వాడీ కేంద్రంలో..


బొబ్బిలి: స్వామివారి వీధి అంగన్‌వాడీ కేంద్రంలో..

'తెర'చాటు బాదుడు

(ఐదో పేజీ తరువాయి)

ఇష్టపడరు. ఇలాంటి వారంతా సినిమా టిక్కెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నప్పుడే స్నాక్స్ కూడా ఆర్డర్ చేస్తుంటారు. ఇటువంటివారిపై జీఎస్టీ రూపంలో అదనపు బాదుడు పడుతుంది. రూ.100 లోపు టిక్కెట్‌తో పాటు స్నాక్స్ ఆర్డర్ చేసుకుంటే పర్వాలేదు. కానీ, అంతకు మించి ధర ఉన్న టికెట్‌తో స్నాక్స్ బుక్ చేసుకుంటే మాత్రం 18 శాతం జీఎస్టీ అని చెప్పి ధరలు పెంచి వసూలు చేస్తుంటారు. వాస్తవానికి మల్టీప్లెక్స్‌ల్లో వాహనాల పార్కింగ్ కు ఎటువంటి రుసుం తీసుకోకూడదు. కానీ, ద్విచక్ర వాహనానికి రూ.20, నాలుగు చక్రాల వాహనాలకు రూ.50 నుంచి రూ.100 బాదేస్తున్నారు. ఇప్పటికైనా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరముంది.

కానరాని తనిఖీలు

సినిమా థియేటర్లలో విక్రయించే తినుబండారాల నాణ్యతపై కొందరు ప్రేక్షకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాటిపై తయారీ, కాలపరిమితికి సంబంధించిన తేదీలు ఉండటంలేదని ఆరోపిస్తున్నారు. కూల్‌డ్రింక్స్‌ను డిస్పోజల్ గ్లాసుల్లో పోసి విక్రయిస్తున్నారు. దీనివల్ల అది ఎన్ని ఎంఎల్ ఉంటుందో తెలియదు. నిబంధనల ప్రకారం అలా విక్రయించకూడదు. అలాగే పాప్‌కార్న్, సమోసాకు సంబంధించి వాటి బరువు ఎంత, తయారీ కాల పరిమితి తేదీలు ఉండాలి. చాలాచోట్ల ఆ వివరాలు ఉండడంలేదు. వీటిని నియంత్రించాల్సిన తూనికలు, కొలతలు, ఆహార భద్రత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సామాన్యులకు కష్టమే..

సామాన్య, మధ్యతరగతి వారు సినిమాకు వెళ్లలేని పరిస్థితి. నలుగురు కుటుంబ సభ్యులు సినిమాకు వెళితే రూ.వెయ్యి ఉండాల్సిందే. టిక్కెట్లు, స్నాక్స్, వాహనాల పార్కింగ్.. ఇలా అన్నింటిలోనూ బాదేస్తున్నారు. సినిమా థియేటర్ అంటేనే బెంబేలెత్తించేలా చేస్తున్నారు.

- సిద్ధార్థ స్థానికుడు, విజయనగరం

జేబులకు చిల్లు తప్పదు..

పిల్లలు మారాం చేస్తున్నారని థియేటర్లకు తీసుకెళితే జేబుకు చిల్లుపడక తప్పదు. పిల్లలు అది కొనాలి.. ఇది కొనాలి అని అడుగుతారు. ఎంత ధరైనా కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. బయట దుకాణాల్లో రూ.5, రూ.10 పెడితే దొరికే చిప్స్ అక్కడ ఉండవు. అక్కడ అంతా కనిపించేవి కాంబో ప్యాకెట్లు. పైగా ధర కూడా రూ.50 పైమాటే.

- రవికిరణ్ స్థానికుడు, విజయనగరం

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సినిమా హాళ్లల్లో తినుబండారాలు, శీతల పానీయాల విక్రయాలతో పాటు మరుగుదొడ్లు, థియేటర్ శుభ్రతపై నిబంధనలు పాటించాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశాలు జారీచేస్తాం. నిబంధనల ప్రకారం క్యాంటీన్లలో విక్రయాలు జరగాలి. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు.

-సేతుమాధవన్, జాయింట్ కలెక్టర్, విజయనగరం

కక్ష సాధింపు చర్యలు తగవు

బొండపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారులు రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదని, నిబంధనలను పక్కాగా పాటించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వ భూములను ఆక్రమణలకు పాల్పడిన వారందరిపైనా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండలంలోని గొల్లలపేటలో గురువారం పీతల చంటిబాబుకు చెందిన రేకుల షెడ్డును రెవెన్యూ అధికారులు కూలగొట్టగా బాధి త కుటుంబ సభ్యులను శుక్రవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా రేకుల షెడ్డు వేసుకొని జీవనం సాగిస్తున్న చంటిబాబు కేవలం వాలంటీరుగా విధులు నిర్వర్తించాడనే రాజకీయ కక్షతో సెంటున్నర స్థలంలో వేసిన షెడ్డును తొలగించారని ఆరో పించారు. అదే ప్రభుత్వ సర్వే నెంబరులోని మిగతా ప్రభుత్వ భూమిని ఎం దుకు తొలగించలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బొండపల్లి, ముద్దూరు గ్రా మాల సర్పంచ్‌లు బొండపల్లి ఈశ్వరరావు, మునకాల పైడిపునాయుడు, ఉప సర్పంచ్ కోళ్ల వెంకటరమణ, ఎంపీటీసీ బండారు శ్రీనివాసరావు, బాధిత కుటుం బ సభ్యులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

రాజాం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల సిబ్బంది సకాలం లో విధులకు హాజరుకావాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం అంతికాపల్లి సచివాలయాన్ని ఆయన సంద ర్శించారు. సిబ్బంది పూర్తిస్థాయిలో విధులకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని

హామీలు అమలు చేయాలి


రిలే దీక్షలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

పాలకొండ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మున్సిప ల్ కార్మికులకు సమ్మె కాలపు హామీల జీవోలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు డిమాండ్ చేశారు. ఈ మేర కు పట్టణంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పాలకొండ నగర పంచాయతీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రిలే దీక్షలు ప్రారంభించారు. జీవో నెంబరు 36 ప్రకారం రూ.21 వేలు ఇవ్వాలని, ప్రభుత్వం నియ మించిన 9 మంది కమిటీ సిఫార్సుల ప్రకారం జీతాలు ఇవ్వాలని కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడ రేషన్ పాలకొండ కమిటీ కార్యదర్శి సీహెచ్ సంజీవి, సభ్యులు ఎస్.సాయికుమార్, సీహెచ్ కార్తీక్, పి.సూరి బాబు దీక్షలో పాల్గొన్నారు. వేణు, అప్పలనాయుడు, కృష్ణవేణి, బాబూరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

కొనసాగుతున్న నియామక ప్రక్రియ


డిజిటల్ ఎక్విప్‌మెంట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో స్టైఫండరీ పోలీసు కానిస్టేబుల్స్ ఉద్యోగ నియామక ప్రక్రియకు తొమ్మిది రోజూ కొనసాగింది. శుక్రవారం 600 మంది పురుష అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 408 మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. హాల్ టికెట్లను పరిశీలించి పీఎంటీ, పీఈటీ పరీక్షలకు అనుమతించారు. ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ సౌమ్యలత, జి.నాగేశ్వరరావు ప్రక్రియను పర్యవేక్షించారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఎక్విప్‌మెంట్‌ను వినియోగించి అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలు నిర్ధారించి పీఈటీ, పీఎంటీ పరీక్షలకు అనుమతించారు. నియామక ప్రక్రియలో డీఎస్పీలు వీరకుమార్, యూనివర్స్ బాహుజీ, శ్రీనివాసరావు, థామస్‌రెడ్డి, ఏవో శ్రీనివాసరావుతో పాటు పలువురు సీఐలు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పంపిణీ చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

రామభద్రపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కొట్టక్కి రెవెన్యూ పరిధిలో గల 537 సర్వే నెంబర్‌లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిని భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఏపీఎస్ ఐడీసీకి కొన్నేళ్ల కిందట 200 ఎకరాలు కేటాయించారని, అయితే ఆ సంస్థ ఏ విధమైన భవనాలు నిర్మించకపోవడంతో నిరుపయోగంగా ఉందని తెలిపారు. వీటిని కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి పేదలకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ ఆకుల సులోచనారాణికి అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు సామిరెడ్డి అప్పలనాయుడు, సోంబార్కి కిరణ్ కుమార్, బలగ మహేష్ పాల్గొన్నారు.

అపరాల విత్తనాలు పంపిణీ

బొబ్బిలి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం, కృష్ణాపురం గ్రామాల్లో జిల్లా ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి ప్రకాష్ ఆధ్వర్యంలో, ఏడీఏ మజ్జి శ్యామ్ సుందర్ సమక్షంలో శుక్రవారం రైతులకు అపరాల విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లడుతూ ప్రధాన పంటతో పాటు అంతర పంటలు ఆదాయం చేకూరుస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి ఉరిటి శంకరరావు, మాస్టర్ ట్రైనర్ శ్రీను, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యం పెంపునకు శిక్షణ

● బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు వృత్తులలో ఉంటూ జీవనం సాగిస్తున్న వారికి మరింత వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇస్తామని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి తెలిపారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఆమె పట్టణంలో గల అన్ని రకాల సర్వీసు ప్రొవైడర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్, బ్యూటీషియన్, సెలూన్, కార్పెంటర్, ఫ్రిజ్, కూలర్, ఏసీ, టీవీ వంటి వాటి మరమ్మతులకు సంబంధించి మరింత నైపుణ్యం పెంచడమే ఈ శిక్షణ లక్ష్యమన్నారు. వెయ్యి రూపాయల ప్రవేశ రుసుం చెల్లించి మూడు నెలల శిక్షణకు విజయనగరం వెళ్లేందుకు సిద్ధం కావాలని ఆమె తెలిపారు. శిక్షణ అనంతరం డ్రెస్ కోడ్, గుర్తింపు కార్డు ఇస్తారన్నారు. హోమ్ ట్రయాంగల్ యాప్‌లో పేర్లను నమోదు చేసుకుంటే ఆన్‌లైన్ సమాచారం అందుకుని ఇళ్లకు వెళ్లి సర్వీసు అందించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో ఎం.జగన్మోహనరావు, సీఎంఎం ఎం.లలిత, సీవోలు పోలినాయుడు, సింహాచలం, అరుణజ్యోతి, వరలక్ష్మి, ఆర్పీలు, సర్వీసు ప్రొవైడర్లు పాల్గొన్నారు.

అత్యంత నాణ్యతతో సుందరీకరణ పనులు

బొబ్బిలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో ఫ్లైఓవర్ బ్రిడ్జి, రోడ్డు డివైడర్లలో చేపడుతున్న సుందరీకరణ పనులను మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు శుక్రవారం పరిశీలించారు. సంక్రాంతి పండుగకు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరంగా స్వాగతం పలికేలా ఈ పెయింటింగ్స్‌ను అత్యుత్తమ నాణ్యత కలిగిన రంగులతో రాజీ లేకుండా వేయిస్తున్నామని చెప్పారు. 500 మీటర్ల విస్తీర్ణంలో రంగుల పనులు చేపడుతున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోయినా వారిని ఒప్పించి పనిచేయిస్తున్నామన్నారు. రూ.18లక్షలతో చేపట్టిన ఈ పనులకు కౌన్సిల్ ఆమోదం ఉందని, ఇందులో రూ.3లక్షల జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. దీనిపై కొంతమంది ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆయన వెంట డీఈఈ కిరణ్‌కుమార్, ఏఈ రవికుమార్, కౌన్సిలర్లు ఇంటి గోవిందరావు, నవలాపురపు రామకృష్ణ ఉన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

బొబ్బిలి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని ఎయిడ్స్, టీబీ కంట్రోల్ రాష్ట్ర కోఆర్డినేటర్ జశ్వంత్ తెలిపారు. శుక్రవారం కోమటిపల్లి గ్రామంలో బొబ్బిలి క్లస్టర్ టీబీ కంట్రోల్ సూపర్‌వైజర్ ఆర్.శ్రీదేవి ఆధ్వర్యంలో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించడానికి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జస్వంత్ మాట్లాడుతూ 100 రోజులు ప్రత్యేక వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉచిత కఫం పరీక్షలు చేస్తామని, ఎక్స్‌రేలు తీస్తామని తెలిపారు. అనంతరం సిబ్బందితో 'టిబి అంతం-అదే మన పంతం' అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ సెంటర్ సీహెచ్‌వో ఆర్.ప్రియాంక, ఏఎన్ఎం వేదప్రియ, ఆశాలు లక్ష్మి, సునీత, మంగ, సామాజిక కార్యకర్త బొంతలకోటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

బాడంగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, యూపీ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులందరూ తల్లిదండ్రులు లేని 20 మంది విద్యార్థులకు నూతన దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఎంఈవోలు పి.లక్ష్మణదొర, ఎం.రాజేశ్వరి చేతులమీదుగా వీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు, శంబంగి శేఖర్, చొక్కాపు రాము, జీవరత్నం, పీటర్ కృష్ణమూర్తి, రామారావు, ఎల్డీఏ కళ్యాణి, సీఆర్పీలు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అలజంగి గ్రామంలో నిరుపేద విద్యార్థులకు వనమిత్ర కృష్ణదాస్ శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది సంక్రాంతికి ఇలా పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు.

న్యూస్ బాక్స్

బైకులు ఢీ.. ఇద్దరికి గాయాలు

రామభద్రపురం, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన కొట్టక్కి గ్రామం వద్ద శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కొట్టక్కి గ్రామానికి చెందిన గేదెల సత్యనారాయణ, సాలూరు మండలం పురోహితుని వలస గ్రామానికి చెందిన వ్యక్తి గాయపడ్డారు. గాయపడినవారు ప్రమాద స్థలం నుంచి ఆసుపత్రికి వెళ్లిపోయారు. పూర్తి వివరాలు తెలియ రాలేదు.

పూరిల్లు దగ్ధం

బాడంగి, జనవరి 10(ఆంధ్రజ్యోతి): వాడాడ గ్రామానికి చెందిన వాడబోయిన సన్యాసి అనే వ్యక్తికి చెందిన పూరిల్లు గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యింది. దాదాపుగా రూ.50వేల ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు సన్యాసి వాపోయాడు. విషయం తెలుసుకున్న జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి ఆర్నెపల్లి రాంప్రసాద్ బాధిత కుటుంబానికి రూ.2వేలు సాయం అందజేశారు.

ప్రైవేట్ బస్సులకు రూ.45 వేలు అపరాధ రుసుం

విజయనగరం, క్రైం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని రవాణ శాఖ ఎంవీఐలు శివరాం, శ్రావ్య హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం విజయనగరంలో ప్రైవేటు బస్సుల్లో తనిఖీలు నిర్వహించారు. నిబంధన లు ఉల్లంఘించిన 10 ప్రైవేట్ బస్సులపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.45వేలు అపరాధ రుసుం వసూలు చేశారు. అధిక చార్జీలు వసూలు చేస్తే రవాణా శాఖకు ఫిర్యాదు చేయాలన్నారు.

వేలం కం టెండరు ప్రకటన

గ్రామ పంచాయతీ కార్యాలయం పాటూరు

రోఃవ నెం.01/2025 తేదీ 10-01-2025

క్ర.సం	పాట వివరము	సంవత్సరము	చెల్లించవలసిన పరావస్తు రూ.లలో
1	[illegible] 269 చెట్లు	2024-2025	5000/-

టెండరు వేసినవారు పంచాయతీ నిర్ణయించిన డిపాజిట్ రూ.1000/-లు ... రూ.3,00,000/- విలువ గల ...

శ్రీమతి కోట్యాడ వెంకటలక్ష్మి, సర్పంచ్ గ్రామ పంచాయతీ,పాటూరు

శ్రీగురజాపు అనిల్ కుమార్, పంచాయితీ కార్యదర్శి గ్రామ పంచాయితీ,పాటూరు



కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్

(Regd.No.614, APMACS Act, 1995)

(H.O) D.NO. 49-34-22, అక్కయ్యపాలెం, విశాఖపట్నం-530 016 ఫోన్ : 0891 - 2562731

Trust - Growth

నోటిఫికేషన్

కనకమహాలక్ష్మి, కో-ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్, విశాఖపట్నం

పాలకవర్గం **తేది.10.01.2025** న పంపిన ఆదేశముల మేరకు 3 (ముగ్గురు) బ్యాంక్ డైరెక్టర్లను ఎన్నుకొనుటకు నేను ఎన్నికల అధికారిగా నియమించబడినాను.

పై బ్యాంక్ మెంబర్లకు ఇందుమూలముగా తెలియజేయడమేమనగా ఈ క్రింది వివరించిన ప్రకారము బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నిక కార్యక్రమము నిర్వహించబడును. **(ఎన్నికల తేది.28.02.2025)**

1. ఎన్నిక జరుగవలసిన డైరెక్టర్ల సంఖ్య	: 3(ముగ్గురు)
2. ఎన్నిక కాబడిన డైరెక్టర్ల కాల పరిమితి	: 5 సం.లు (01.03.2025 నుండి)
3. డైరెక్టరుగా ఎన్నిక కాబడుటకు కావలసిన అర్హతలు	: ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ యాక్టు 1995 మరియు బ్యాంక్ బైలాలో ప్రస్తావించబడిన విధంగా
4. నామినేషన్ పత్రము దాఖలు చేయవలసిన తేది, స్థలము, సమయం	: **17-02-2025** ఉదయం 10 గం॥ల నుండి సా॥ 3.00 గం॥ల వరకు సదరు బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం)లో ఎన్నికల అధికారికి గాని వారి అనుమతి పొందిన వారికి గాని దాఖలు చేయవలెను.
5. నామినేషన్ ఫీజు	: **రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు)**
6. నామినేషన్ పత్రములు పరిశీలన	: **18-02-2025** ఉదయం 10 గం॥ల నుండి బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు
7. ఆమోదించిన నామినేషన్ పత్రముల ప్రకటన	: **19.02.2025** బ్యాంక్ ప్రధాన కార్యాలయం నందు
8. నామినేషన్ పత్రముల ఉపసంహరణ	: **20.02.2025** ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు
9. నామినేషన్ పత్రముల నిఖర జాబిత ప్రకటన	: **21.02.2025** సాయంత్రం 5 గం॥ల తరువాత బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు. పోటీలేని పక్షములో అదేరోజు సాయంత్రం 6.00 గం॥లకు ఎన్నికల ఫలితాలు ప్రకటించబడును.
10. ఎన్నికల తేది	: **28.02.2025** ఉదయం 10 గం॥ల నుండి సాయంత్రం 5.00 గం॥ల వరకు బ్యాంక్ ప్రధాన కార్యాలయం (విశాఖపట్నం) నందు
11. ఎన్నికల విధానం, ఓట్ల లెక్కింపు	: రహస్య బ్యాలెట్ పద్దతిన **28.02.2025** తేదీన ఎన్నిక ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభించి, ఎన్నికల ఫలితాలు అదే రోజు ప్రకటించబడును.

సం/- కె.శంకర్
న్యాయవాది మరియు ఎన్నికల అధికారి
కనకమహాలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్.
డోర్ నెం.49-34-22, (H.O) అక్కయ్యపాలెం, విశాఖపట్నం16.

విశాఖపట్నం
తేది.10.01.2025

షరతులు:
1. నామినేషన్ పత్రములు ఎన్నికల అధికారికి దరఖాస్తు పెట్టుకొని ఉచితముగా పొందవచ్చును.
2. నామినేషన్ దాఖలు చేయువారు మరియు వారిని ప్రపోజ్ చేయువార్ల పేరు, ఎన్నికల అధికారి పబ్లిష్ చేసిన మెంబర్ల లిస్టులో ఉండవలెను.
3. డైరెక్టర్ల ఎన్నికలు The A.P. Mutually Aided Co-Operative Societies Act, 1995 మరియు బ్యాంక్ బైలా మేరకు జరుపబడును.
4. ఓటు వేయుటకు అర్హత పొందిన మెంబర్ల జాబితా కావలసిన యెడల **రూ.2,500/- (అక్షరాల రెండు వేల ఐదు వందల రూపాయలు)** రుసుము చెల్లించి, నామినేషన్ల ఖరారు కాబడిన తుది జాబితాలోని అభ్యర్థులు మాత్రమే ఎన్నికల అధికారి నుండి పొందవచ్చును.



